

# లావణ్య

వారాల కృష్ణమూర్తి

పిడుగులు పడ్డట్టు తలుపులు మోగడంతో లావణ్య నిద్ర ఎగిరిపోయింది.... 'ఈ విశాలకు పనేం లేదు. అలా నడుం వాలిస్తే చాలు తయారవుతుంది. ఊరకే ఇల్లిల్లూ తిరిగి వాళ్ళ విషయాలు వీళ్ళకు, వీళ్ళ విషయాలు వాళ్ళకు చేరేస్తేగాని,పాలుపోదు'....మనసు లోనే విసుక్కుంటూ లేచింది. ఈలోపల తలుపులు మరోమారు రొదపెట్టాయి. "వస్తున్నా!...."

వుందని టెలిగ్రాం వచ్చింది...."

జేబులోని టెలిగ్రాం లావణ్య కందించాడు. లావణ్య టెలిగ్రాం చదివి, టేబుల్ మీద పడేసి లోని కెళ్ళింది.

అసలు ఈ విషయం తెలిసి ఎంత హైరానా పడుతుందో.... ఎలా చెప్పడమా అని తల బద్దలు కొట్టుకున్న రామక్రిష్ణ, లావణ్య నిర్లిప్తంగా టెలిగ్రాం పడేసి లోని కెళ్ళడం చూసి ఆశ్చర్యపోయాడు.

---

**ఆ రోజునుండి పెళ్ళిచూపులు జరిగినప్పుడల్లా వచ్చి నతని వైపు ఆశగా, దీనంగా చూచేది. ఒక్కరికీ తనమీద దయకలిగింది కాదు. రోజురోజుకు బ్రతుకు మీద నిరాశ పేరుకుపోయేది. ఆఖరకు ఎదురింటి వెంకటేశం ఆకలి చూపులు చూసి అతనితో లేచిపోదామా .... అనిపించేది.**

---

అంటూ తలుపు తీసి ఎదురుగా వున్న భర్తను చూసి క్షణం నివ్వెరపోయింది లావణ్య.

రామక్రిష్ణ అసహనంగా పెళ్ళి కుర్చీలో కూర్చున్నాడు. లావణ్య భర్త మొహంలోని భావాలు చదవ లేక బిత్తరపోయి.... "ఏమిటి అలా ఉన్నారు....?" అంది.

"మనం మీ ఊరు వెళ్ళాలి"

"ఎందుకు? నెలమధ్యలో...."

"మీ నాన్నకు సీరియస్‌గా

కాస్సేపటికి కాఫీ కప్పులతో తిరి గొచ్చి ఒకటి భర్త కిచ్చింది లావణ్య.

"త్వరగా ప్రయాణమవ్వాలి!" కాఫీ అందుకుంటూ అన్నాడు రామక్రిష్ణ.

"చేతిలో పైసా లేదు...." అంది లావణ్య.

"రెండు వందలు తెచ్చా!"

"ఎక్కడివి? అప్పుచేశారా?" ఏమిటి లావణ్య అలా అడుగు

తుంది. ఇలాంటప్పుడు డబ్బు గురించి ఆలోచిస్తూ కూర్చుంటే ఎలా? అందుకే తను ఆఫీసులో ఓ మిత్రుడిని అడిగి తెచ్చాడు.

"జీతాలొచ్చాక పోవచ్చుగదా"

"ఈరోజు తారీకెంతో తెలుసా? ఇరవై.... అవతల ప్రమాదంగా వుందంటే మనం తీరుబడిగా వెళ్దామా! త్వరగా తయారవు...." విసుక్కున్నట్టే చెప్పాడు.

"నాకంటే మీకే ఎక్కువ ఇదిగా వుందే...." అంటూ లోని కెళ్ళింది లావణ్య.

*  *

రైలు, గమ్యాన్ని చేరాలని వేగంగా దూసుకు పోతుంది. లావణ్య మనసు మాత్రం మెల్లగా గతంలోనికి జారుకుంటుంది. ఎంత వద్దని కూడతీసుకున్నా, ఏవైతే తను మరచిపోవాలని చూస్తుందో, వాటివైపే తొంగి చూస్తుంది మనసు.

లావణ్య, రామనాథం, లక్ష్మీదేవిల పెద్ద కూతురు. లావణ్య బాల్యమంతా గలగల పారే సెలయేరులా గడిపింది. ఆ తరువాతే బ్రతుకు దుర్భరమైంది. అన్నీ వుండి ఏమీ లేనిదానిలా తయారయింది. నరకంలో వున్నట్టు వుండేది. ఆమె పాలిటి యముడు రామనాథం. కన్నతండ్రే అయినా కఠోరంగా ప్రవర్తించేవాడు. ఎవరి కన్నా చెప్పుకున్నా నమ్మరు. ఒక్క లావణ్య విషయంలోనే అంత కఠినత్వం ఎందుకో, లావణ్యకు తెలిసేది కాదు. లావణ్య తల్లికి అర్థమయింది కాదు.

తనకింకా బాగా గుర్తు. ఆరోజు తనకు బాగా ఆకలేసింది. అమ్మను అన్నం పెట్టమంది. 'నాన్న రానీ! అందరికీ ఒకేసారి పెట్టేస్తా!' అంది అమ్మ. 'లాభం లేదు. ఆకలి దంచేస్తుంది' అంది తను. ఇహ తప్పదన్నట్టు అమ్మ చెల్లెళ్ళను, తమ్ముళ్ళను పిలిచింది. వాళ్ళు 'మా కిప్పుడే వద్దు. నాన్న రానీ!' అన్నారు. సర్లెమ్మని తనకు వడ్డించింది. అన్నం, కూర కలుపుకుని రెండు ముద్దలు నోట్లో పెట్టుకుందో లేదో నాన్న వచ్చాడు. వస్తూనే తన్ను చూసి, 'అప్పుడే తింటు న్నావా? ఏడన్నా కాలేదు.దయ్యంలా ఎప్పుడూ తిండే.... ఛీ....ఛీ.... దరిద్రపుదాన....' అన్నాడు.

నాన్న అంతమాట అంటా డని అనుకోలేదు. ఆ మాటలు

విన్న తరువాత అన్నం సహించ లేదు. కళ్ళల్లో నీళ్ళు నిలచాయి. చరచరా లేచింది తను.

'కోపాలకేం తక్కువ లేదు. అలా అంత అన్నం వదిలేస్తే ఎలా.... ఎవడు తింటాడు నీ ఎంగిలి....' కసిరాడు.

తనేం మాట్లాడకుండా చెయ్యి కడుక్కుని, తన గదిలోనికెళ్ళి మంచం మీద పడి కుళ్ళి కుళ్ళి ఏడ్చింది.

లావణ్య కళ్ళు తుడుచుకుని అటూ ఇటూ చూసింది, ఎవరైనా తన్ను చూస్తున్నారేమో అని. ఎదురుగా వున్న ముసలామె తన్నే చూస్తుంది. కంట్లో నలుసు పడిందా నిలా కళ్ళను మాటిమాటికి వత్తుకుంటూ ముసలామెవైపు చూసింది. ఈసారి ఆమె కళ్ళు మూసుకొని వుండడం చూసి, కిటికీలోంచి దృష్టి సారించింది. చిక్కటి చీకటి. తన గతంలాంటి భయంకరమైన చీకటి చూసి కళ్ళు మూసుకుంది లావణ్య.

ఒక్కసారి కాదు, అలా ఎన్నో సార్లు నాన్న తన్ను ఈసడించుకున్నాడు. చెల్లెళ్ళను, తమ్ముళ్ళను ఏమీ అనేవాడు కాదు. వాళ్ళు ఆడింది ఆట. ఛివరకు వాళ్ళ కూ్కడా తను అలుసయింది. అమ్మ అంతా చూస్తూ కూడా ఏమీ చెయ్యలేకపోయింది. ఒకటి రెండు సార్లు నాన్నని....'ఏమిటలా సాధిస్తారు దాన్ని....' అని నిలదీసింది. దానికి నాన్న ....'నువ్ నోరు మూసుకో! నాకు తెలుసు ఎవరితో ఎలా మాట్లాడాలో. నువ్ దాన్ని వెనకేసుకొస్తే బావుండదు....' అని గట్టిగా కేకలేశాడు.

ఆనాడు శనివారం. శనివారాలు ఇంటిల్లిపాదీ రాత్రి టిఫిన్‌తోనే గడుపుతాం. ఆరోజు ఉప్మా చేసింది అమ్మ. అంతా కూర్చుని తింటున్నాం. నీరజ, సరోజ ప్లేట్లు ఖాళీ చేసి, 'అమ్మా....' అంటూ కేక వేశారు. అమ్మ మళ్ళీ వాళ్ళకు ఉప్మా పెట్టింది. నాన్న, సుధీర్, సాగర్ మొదట పెట్టిందే ఇంకా తింటున్నారు. తను కూడ ప్లేట్ ఖాళీ చేసి అమ్మవైపు చూసింది. అమ్మ ఏదో పనిలో వుంది. నల్లెమ్మని లేచింది తను. 'ఏమిటే.... కూర్చో....' అంటూ ఉప్మా పెట్టింది. తను కూర్చుంది. అంతే!

'ఉపవాసమంటే టిఫిన్ గొంతు వరకు తినడం కాదు. దాని బదులు

శుభ్రంగా అన్నమే తినొచ్చు....' అన్నాడు నాన్న తన్ను చూస్తూ.

ఛా! పాడు తనెందుకూర్చుంది అమ్మ పిలిస్తే మాత్రం....లేచింది తను 'ఏమిటే.... పోతున్నావ్.' అంది అమ్మ. అమ్మ మాటలు పట్టించుకోకుండా అక్కడ్నుండి తను వెళ్ళి పోయింది.

'మీరు దాన్నెందు కలా అన్నారు....' అమ్మ గొంతుక.

'ఏమన్నా....!'

'ఏమో....వీళ్ళంతా మళ్ళీ అడిగి పెట్టించుకో లేదూ! మీ కళ్ళెప్పుడు దానిమీదే....'

'నువ్ నోరుముయ్....' నాన్న అమ్మను శాసించడం వింది తను.

అంతే! ఆ నాటినుండి శని వారాలు పూర్తిగ ఉపవాసం ఉంటం అలవాటు చేసుకుంది తను. అమ్మ ఎంతగానో బ్రతిమాలింది, కాస్త టిఫిన్ తినమని. కానీ, తను ఒప్పు కోలేదు. అలా తన పెళ్ళయ్యే వరకు శనివారాలు ఉపవాసమే వుంది.

నాన్న ఎంత హీనంగా చూసే వాడు! ఏమిటో తను చేసిన తప్పు. పండగలకు బట్టలు తెచ్చినా చెల్లెళ్ళకు, తమ్ముళ్ళకు మంచివి తెచ్చి, తనకు మాత్రం తప్పదన్నట్టు నాసిరకంవి తెచ్చేవాడు. రోజూ దేనికో ఓ దానికి విసుక్కుంటూనే వుండేవాడు.

చివరకు నిద్రలేస్తూనే కాఫీ తాగకపోతే తల పోటొచ్చే తను నాన్న....'కాఫీ లేకపోతే చావరు. ఒకటి రెండు రోజులు తల నొచ్చినా అదే తగ్గి పోతుంది....' అనడంతో కాఫీ కూడ మానేసింది.

ఒక్క కాఫీ ఏమిటి, తన కోరిక లన్నింటినీ చంపుకుని బ్రతికింది. అప్పుడప్పుడు తన పదహారవ ఏట తీసుకున్న ఫోటో చూసి ఎలా వుండే దాన్ని....ఎలా అయ్యా నని నిట్టూర్చేది. తనకీ చెరనుండి విముక్తి ఎప్పుడా అని ఎదురు చూసి చూసి, పెళ్ళయి తను వెళ్ళి పోతేగాని, మనసుకు కుదుట వుండ దనుకుంది. ఆ రోజునుండి పెళ్ళి చూపులు జరిగినప్పుడల్లా వచ్చినతని వైపు ఆశగా, దీనంగా చూసేది. ఒక్కరికీ తన మీద దయకలిగింది కాదు. రోజు రోజుకు బ్రతుకు మీద నిరాశ పేరుకు పోయేది. ఆఖరకు ఎదురింటి వెంకటేశం ఆకలి చూపులు చూసి, అతనితో లేచి పోదామా.... అనిపించేది. కానీ, భయం. పోనీ చచ్చిపోతే.... ఎలా

ఎలా చావడం....ఇలా రోజూ బ్రతుకుతో పోరాడి పోరాడి మొండిగా నెట్టుకొచ్చింది....

"లావణ్యా!" అంటూ మెల్లగా తట్టి లేపాడు రామక్రిష్ణ. "ఊ...." అంటూ లేచింది.

"ఊరొస్తుంది. పక్క స్టేషనే" సూట్ కేస్ తెరిచి అందులో తన దుప్పటి పెట్టాడు రామక్రిష్ణ. లావణ్య తన దుప్పటికూడా మడిచి ఇచ్చింది.

"టైం ఎంతయింది?" అడిగింది లావణ్య

"ఆరు...."

స్టేషన్ వచ్చింది. రామక్రిష్ణ సూట్ కేస్ తీసుకుని దిగాడు. లావణ్య అతని వెనకే దిగింది. ప్లాట్ ఫాంలోని జనాన్ని చీల్చుకుంటూ స్టేషన్ బైటపడి రిక్షా ఎక్కారు.

అయిదేళ్ళ తరువాత పుట్టింటికి వస్తుంది లావణ్య. పెళ్ళయిం తరువాత ఎప్పుడూ లావణ్య పుట్టింటికి పోదామని రామక్రిష్ణని కోరలేదు. లావణ్య తండ్రి పెళ్ళయిన సంవత్సరంలోని ప్రతి పండక్కి రమ్మని ఉత్తరాలు రాశాడు. ఓసారి తనే స్వయంగా వచ్చిపిలిచాడు. లావణ్య మాత్రం రానని ఖచ్చితంగా చెప్పేసింది. రామక్రిష్ణ పోదామన్నా 'కావాలంటే మీరు వెళ్ళండి!' అనేది. లావణ్య మనస్తత్వం అర్థమయేది కాదు రామక్రిష్ణకు.

రిక్షా ఇంటి ముందు ఆగింది. ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది. గేటు తీసుకుని లోనికి అడుగేశాడు రామక్రిష్ణ, వెనకే నడిచింది లావణ్య.

"అమ్మా. అక్కయ్య వచ్చిందే" అంటూ కేకవేశాడు లావణ్య తమ్ముడు సుధీర్. ఆ కేకకు రామనాధం తప్ప అంతా వచ్చారు.

"మామయ్య కెలా వుందత్తయ్యా!" ఆదుర్దాగా అడిగాడు రామక్రిష్ణ. ఆమె చెంగును ముఖాని కడ్డుపెట్టుకుంది కుమిలిపోతూ.

రామక్రిష్ణ గబగబా రామనాధం గదిలోనికి వెళ్ళాడు. అంతా అతన్ని అనుసరించారు. రామనాధం మంచం మీద కళ్ళు మూసుకుని పడుకుని వున్నాడు.

"నాన్నా! లావణ్య అక్కయ్య వచ్చింది" మెల్లగా పిలిచాడు సాగర్. రామనాధం కళ్ళు తెరచి కూతుర్ని, అల్లుణ్ణి చూసి సంతోషంతో లేవబోయాడు.

"మీరుపడుకోండి మామయ్యా!" అంటూ రామక్రిష్ణ పడుకోబెట్టాడు.

"ఎప్పుడొచ్చారు...." ఆయా సాన్ని సూచిస్తుందా స్వరం.

"ఇప్పుడే నండి!" అన్నాడు రామక్రిష్ణ.

"లా వ ణ్యా బాగున్నావా?" అంటూ కచకచా దగ్గాడు. ఆ తరువాత కాస్సేపు హాలంతా రామనాథం ఉచ్ఛ్వాస నిశ్వాసలతో నిండింది.

"డాక్టర్ ఏమన్నాడు....ఇంత అయేంత వరకూ మాకెందుకు తెలియచెయ్యలేదు." ....రామక్రిష్ణ గొంతు బొంగురు పోయింది.

"ముందు....మొహాలూ, అవీ కానివ్వండి, తరవాత మాట్లాడుకుందాం!" అతికష్టంమీద మాటలు పూర్తి చేశాడు రామనాథం. లావణ్య అక్కడనుండి కదిలింది.

* * *

"ఏమిటో లావణ్యా! నీ కేమయినా పిచ్చెక్కిందా...." కటువుగా అన్నాడు రామక్రిష్ణ.

"నాకేమీ పిచ్చిలేదు!"

"మరయితే ఈ అర్థాంతర ప్రయాణ మేమిటి? పొద్దునేగా వచ్చింది, రాత్రికే పోదామా.... అవతల మీ నాన్న పరిస్థితి చూస్తే—"

"నేను మిమ్మల్ని ఇంక ఏమీ కోరను. ఈ ఒక్కసారి నా మాట వినండి. మనం వెళ్దాం."

"ఎవరిమీద నీ కోపం?.... అయినా ఎందుకంత పట్టుదల?"

"అవన్నీ ఇప్పుడెందుకు? రాత్రికి మనం వెళ్ళిపోవాలి."

"సరే! వెళ్ళి మీ నాన్నతో ఈ విషయం చెప్పిరా, అలాగే పోదాం.

"నేను చెప్పను."

"అయితే నేనూ చెప్పను. చెప్పకుండా పోవడం జరగదు."

"సరే నేనే చెప్తా." అని లావణ్య చరచరా తండ్రి గదికి వచ్చింది. ఆమె వెనకే రామక్రిష్ణ వచ్చాడు.

పొద్దుటినుండిలావణ్య తండ్రితో ఒక్క మాటకూడ మాట్లాడ లేదు. తల్లి పలకరించినా ముక్తసరిగా సమాధాన మిచ్చింది.

లావణ్య రావడం చూసి అంతా ఆశ్చర్యంగాలావణ్యవైపుచూశారు. లావణ్య కాస్సేపు తటపటాయించి నేలచూపులు చూస్తూ.... "మేము రాత్రి బండికి పోతున్నాం ...." అంది.

" ఏమిటే? ఎందుకు ఇలా మమ్మల్ని....బాధిస్తావ్. పొద్దున

వచ్చావ్, ఇంతవరకూ మీ నాన్నతో ఒక్కమాటైనా మాట్లాడ లేదు. ఇప్పుడేమో ప్రయాణమంటూ....'' లావణ్య తల్లి గుండెలోని బాధంతా గొంతుకలో ధ్వనించింది.

''ఏం మాట్లాడాలి .... మీరు నన్ను అందరిలాగే పెంచుంటే నాకూ మీ మీద ఆప్యాయత, అభిమానం ఉండేవి. లేనిదాన్ని తెచ్చిపెట్టుకుని నటించలేను....''

''కన్నవాళ్ళతో ఇలాగేనా మాట్లాడేది?''

''కన్నవాళ్ళలా పెంచారా నన్ను? శత్రువులా అనుక్షణం హింసించారే! అప్పుడు కూతుర్ని కాక పోయా. ఈ నాడెలా కూతుర్నవుతా....'' ఇన్నాళ్ళ తన కసిని వెళ్ళగక్కింది లావణ్య.

సమాధానంచెప్పలేక పోయింది లావణ్య తల్లి. వాళ్ళ మాటలు వింటున్న అందరికీ ఏదో ప్రళయం రాబోతుందనిపించింది.

రామనాథం మెల్లగా లేవబోయాడు. సాగర్, రామక్రిష్ణ పట్టుకుని కూర్చోపెట్టారు. రామనాథం మెల్లగా లావణ్య వైపు చూసి వచ్చే ఆయాసాన్ని దిగమింగి .... ''లావణ్యా! నీతో ఏకాంతంగా కొంత సేపు మాట్లాడాలి ....'' అన్నాడు.

''ఎందుకు?''

''తర్వాత నీకే తెలుస్తుంది..'' అంటూ అక్కడున్న అందరివైపు చూసి 'మీరెళ్ళండి' అని చేత్తో సైగచేశాడు. లావణ్య తప్ప అంతా వెళ్ళారు.

''లావణ్యా! నేను నీ మేలుకోరే అలా నిన్ను హింసించాను'' దగ్గుతెర రెపరెపలాడింది.

''తాటిచెట్టు- పాలు కథలా వుంది.''

''నువ్వు నమ్మవ్. కానీ, ఇది నిజం. ఈ నిజాన్ని నీకు చెప్పాలని నీ పెళ్ళయిన మరుక్షణం నుండి ఎదురు చూశా. కానీ, నువ్వు నాకా అవకాశం ఇవ్వలేదు. ఈనాడైనా అవకాశం వచ్చింది. అంతేచాలు''

''నిన్ను చిన్నప్పుడు ఎంతో గారాబంగా చూసుకున్నాం. ఆ గారాబం నా బంగారు తల్లి భాగ్యానికి అడ్డుగా నిలుస్తుందని ఊహించలేదు''....ఓ నిట్టూర్పు వదిలి ఓ సారి బరువుగా కళ్ళుమూసి తెరిచాడు..... ''నీకు పదహారు ఏళ్ళు రాగానే పెళ్ళి ప్రయత్నాలు మొదలు పెట్టాను. మొదటిసారి నిన్ను చూడ్డానికి ఓ ఇంజనీరు వచ్చాడు. అతను నీకు నచ్చలేదు. నీకు నచ్చినా నచ్చకున్నా వాళ్ళు ఒప్పుకుంటే పెళ్ళి చేద్దామని నిర్ణయించు

కున్నా. పెళ్ళి చూపుల తరవాత వాళ్ళతోపాటు రైల్‌స్టేషన్ వరకూ వెళ్ళి, అబ్బాయి అమ్మా నాన్నలను వాళ్ళ అభిప్రాయం చెప్పమన్నా. ఊరెళ్ళి ఉత్తరం రాస్తామన్నారు. రైలు రావడానికి ఆలస్యముండని సిగరెట్ కోసం అలా వెళ్ళా. అక్కడ ఆ అబ్బాయి, అతని స్నేహితుడు మాట్లాడుతూ కనిపించారు."

"ఏరా లావణ్యని పెళ్ళి చేసుకుంటావా?...." అని అడిగాడు స్నేహితుడు.

"ఆ పేరు బలేగా పెట్టార్రా ఆ అమ్మాయికి. ఆ అమ్మాయికి పెళ్ళెందుకు. వాళ్ళ నాన్న ఓ ఎకరం పొలం ఓ ఎద్దుతో సాగు చేసుకోవచ్చు, గున్న ఏనుగులా వుంది."

"ఓ ఎద్దుతోనా!"

"ఆఁ....ఇంకో ఎద్దు ఆ అమ్మాయి. అబ్బా పిప్పళ్ళబస్తా లావుంది. దాన్నెవరు చేసుకుంటారు. లక్ష రూపాయలు కట్నమిచ్చినా ఏ బుద్దాయీ చేసుకోడు...."

గుండెల్లోని బాధ దగ్గును ముందుకు తోసింది. రెండు నిమిషాలు గుక్క తిప్పుకోకుండా దగ్గి, నాన్నెప్పు బరువుగా శ్వాస పీల్చి చెప్పడం ప్రారంభించాడు రఘునాథం.

"అంతే.... ఇహ అక్కడ వుండ లేక ఇంటికి బయలుదేరా. దార్లో ఆ మాటలే నా చెవుల్లో గింగుర్లు తిరిగాయి....ఒకఎద్దు....ఎకరం పొలం....పిప్పళ్ళబస్తా....గున్న ఏనుగు.... నిజమే! నువ్వు ఆరోగ్యంగా, లావుగా వున్నావ్ కానీ, అది నీ పెళ్ళికి ఆటంకం అయింది. కట్నం ఎంతయితే ఇచ్చుకోగలను కానీ, నీ లావెలా తగ్గించను! మేము గారాబంగా నిన్ను చూసుకున్నందుకు శిక్షగా లావయ్యావా అనిపించింది. కూతుళ్ళను అపురూపంగా చూసుకోవడమే నేరమా అనిపించింది. నీతో పాటు నీ చెల్లెళ్ళూ వున్నారు. నీవు తిన్నదే తిన్నారు కానీ, వాళ్ళలాగే వున్నారు. నీవు మాత్రం....నా నోటితో ఈ సంగతి నీకు చెప్పి నిన్ను కష్టపెట్టలేను. మీ అమ్మకు చెప్పినా వాళ్ళని నాలుగు తిట్టి....నా కూతురికేం....ఏమీ కాకపోతే పురాకడు. అని రాద్ధాంతం చేస్తుందని నాలో నేనే ఎలాగైనా సరే నిన్ను మానసికంగా క్రుంగదీయాలి, అతిగా తినకుండా చూడాలి అని నిర్ణయించుకున్నా.... ఆనాడే.... నిన్ను దయ్యంలా ఎప్పుడూ తిండే.... దరిద్రప్రదానా.... అని అన్నం

ముందు కూర్చున్న నిన్ను తిట్టా.... ఆ నాటినుంచీ నిన్ను అనుక్షణం పరిశీలిస్తూ, ఎప్పుడు ఏం తింటున్నా ఎదురుపడేవాడిని. ఏదో ఒకటి అనేవాడిని. దానితో నువ్వు భోజనం కూడా తగ్గించావ్.... అదొక్కటే కాదు, నీ కోరికలన్నీ చంపుకున్నావ్.

"ఇంజనీర్ నచ్చని నీకు సాధారణ గుమాస్తా రామకృష్ణ నచ్చాడు. నచ్చటం కాదు, సరిపెట్టుకున్నావ్. రామక్రిష్ణ నిన్ను చూసి కట్నం లేకున్నా నిన్నే చేసుకుంటానన్నాడు. కానీ, మీ అమ్మకు అబ్బాయి నచ్చలేదు. నేనూ మీఅమ్మ మాట కాదనలేక పోయాను. అయినా నీవు తెగించి 'నేను అతన్ని పెళ్ళిచేసుకుంటా' అన్నావ్. అప్పటికే నీకు ఇరవై ఏళ్ళు. ఇంకా ఆలస్యం పనికిరాదని మేమూ ఒప్పుకున్నాం. నిజానికి రామక్రిష్ణ దొరకడం మన అదృష్టం ...." కళ్ళల్లో దుముకడానికి సిద్ధంగావున్న నీళ్ళను ఆపుకుంటూ, గొంతులో కరకర లాడుతున్న దగ్గుని అదిమిపట్టి ఆయాసపడుతూ లావణ్య ముఖం చూశాడు రామనాథం.

"నిన్ను ఏదన్నా అన్నరోజు నేను ఎంతగానో కుమిలిపోయేవాడిని. చివరకు నీ చెల్లెళ్ళూ, తమ్ముళ్ళూ నిన్ను చులకనచేస్తున్నా సహించా. అప్పుడు నువ్వు ఎంతటి నరకయాతన అనుభవించావో. నన్ను క్షమిస్తావా లావణ్యా!"

"నాన్నా.... మిమ్మల్ని అర్థం చేసుకో లేకపోయాను...." కళ్ళ నీళ్ళు పెట్టుకుంటూ అంది లావణ్య.

"లావణ్యా...." ఏదో చెప్పబోతుండగా నేనున్నానంటూ దూసుకు వచ్చింది దగ్గు. రామనాథం వంకర్లు తిరిగి పోయాడు. లావణ్య, రామనాథాన్ని పడుకోబెట్టింది. రామనాథం ఊపిరి అందుకోలేక, దగ్గును అణచలేక సతమత మవుతున్నాడు. అంతటి యాతనలోనూ కూతురు తన్ను అర్థం చేసుకుందనే సంతోషం ఉక్కిరి బిక్కిరిచేసి అతన్ని మళ్ళీ దగ్గనివ్వకుండా చేసింది.

"నాన్నా!" లావణ్య భోరున ఏడ్చింది. ఏడుపు విని ఏం జరిగిందని రామక్రిష్ణ, లావణ్య తల్లి, చెల్లెళ్ళు, తమ్ముళ్ళు వచ్చారు. లావణ్య పసిపిల్లలా తండ్రి పాదాల చెంత ముఖందాచుకుని ఏడుస్తుంది. అర్థం చేసుకోలేక తండ్రియెడల శత్రుత్వాన్ని పెంచుకున్నందుకు కన్నీళ్ళతో తండ్రి పాదాలు కడుగుతూ అలానే ఉండిపోయింది లావణ్య.

*